ఆంధ్రజ్యోతి



నిర్మల్
జిల్లా వార్తలు
8
శుక్రవారం 31 అక్టోబరు 2025

నిర్మల్ నుంచి అరుణాచలానికి ఆర్టీసీ బస్సు

నిర్మల్‌రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ నిర్మల్ డిపో నుంచి నవంబరు 7వ తేదీ అరుణాచలానికి సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డిపోమేనేజర్ కే.పండరి తెలిపారు. ఈ బస్సు నవంబరు 7వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్మల్ బస్టాండ్ నుంచి బయలుదేరుతుందన్నారు. వివిధ గుడులు గోపురాలు దర్శించుకొని తిరిగి నిర్మల్ చేరుకుంటుందన్నారు. యాత్ర 5 రోజులు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9959226003, 8328021517, 7382842582లో సంప్రదించాలన్నారు.

కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైంది

▸▸ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పంట ధాన్యాల కొనుగోలు ప్రక్రియను ప్రారంభించినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 317 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని అన్నారు. నేటివరకు జిల్లాలో 10 సోయాబీన్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. మొక్కజొన్న కేంద్రాలను ప్రారంభించడంతో పాటు గురువారం వరకు మొత్తం 29,100 క్వింటాళ్ల మొక్కజొన్న పంటను రైతుల నుంచి కొనుగోలు చేశామని పేర్కొన్నారు. వివిధ ఏజెన్సీల ద్వారా అన్ని పంటల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో పాటు రైతులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. రైతులు తమ పంటను ప్రభుత్వం నిర్దేశించిన తేమశాతం వచ్చాక అమ్మాలని చెప్పారు.

పోలీసుల నారీశక్తి

▸▸ బ్లూకోట్, డయల్ 100కి సత్వర ప్రతిస్పందన
▸▸ సైబర్‌నేరాలు, ట్రాఫిక్ నియమాలపై పాఠశాలల్లో అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసులు

నిర్మల్‌రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసుశాఖ చేపడుతున్న ప్రతి బుధవారం 'నారీశక్తి' కార్యక్రమంతో సమస్యలు పరిష్కారమవుతున్నాయి. మహిళా పోలీసు సిబ్బంది తమ పోలీసుస్టేషన్ల పరిధిలో పెట్రోలింగ్ డ్యూటీతో పాటు వచ్చిన డయల్ 100కు కాల్స్‌కు తక్షణమే స్పందించి బాధితుల సమస్యలు పరిష్కరించారని ఎస్పీ జానకిషర్మిల తెలిపారు. వీటితో పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టి, గ్రామాల్లో ఉన్న పాఠశాలలను సందర్శించి పిల్లలకు సైబర్‌నేరాల గురించి అవగాహన కల్పించారు. ప్రజలకు ట్రాఫిక్ నియమాలు, మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే దుష్పరిణామాలు, మద్యం తాగి వాహనాలు నడపడం, హెల్మెట్‌లేకుండా ప్రయాణం చేయడం వల్ల సంభవించే ప్రమాదాల గురించి వివరించారు. విలేజ్ పోలీసింగ్‌లో భాగంగా మహిళా సిబ్బంది తమ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రతీ గ్రామాల్లో తిరుగుతూ కల్తీ కల్లు, గంజాయివాడకం, అక్రమ రవాణాపై ప్రజలకు చైతన్యం కల్పించారు. నారీశక్తిలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసులు

నాణ్యమైన పత్తి పంటకు మద్దతు ధర

▸▸ కలెక్టర్ అభిలాష అభినవ్



కొనుగోలు కేంద్రానికి వచ్చిన పత్తికి పూజలు చేస్తున్న దృశ్యం

నిర్మల్‌చైన్‌గేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన పత్తి పంటకు రైతులందరికీ మద్దతు ధర లభిస్తుందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం బీజేఎల్పీ నేత, నిర్మల్ శాసనసభ్యుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డితో కలిసి పట్టణంలోని కేదార్‌నాథ్ జిన్నింగ్ మిల్లులో పత్తికొనుగోలు కేంద్రాన్ని రిబ్బన్‌కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పత్తిపంట కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు ప్రక్రియను పూర్తిచేయాలని వివరించారు. రైతులు పండించిన పంటను మొత్తం సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారానే సేకరించాలన్నారు. ఆ విధంగా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. రైతులు పంటను అమ్మిన వెంటనే వారి ఖాతాల్లోకి డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వివరించారు. ప్రభుత్వం పత్తిపంటకు క్వింటాల్‌కు రూ.8 వేల 110 రూపాయల మద్దతు ధర అందిస్తుందన్నారు. పత్తి రైతులు తాము పండించిన పంటను ప్రభుత్వం నిర్ణయించిన తేమ శాతం ప్రకారం అమ్మి, మద్దతు ధరను పొందాలని పేర్కొన్నారు. ప్రైవేట్‌కు తమ పంటను అమ్మి, రైతులు నష్టపోవద్దని సూచించారు. రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా పంట అమ్మకానికి సంబంధించి స్లాట్ బుక్ చేసుకోవాలని చెప్పారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

▸▸ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

పత్తి పంట అమ్మకంలో రైతులకు ఇబ్బందులు కలుగకూడదని నిర్మల్ శాసన సభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. రైతులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరను అందించాలని పేర్కొన్నారు. తేమ నిర్ధారణ పారదర్శకంగా జరగాలని చెప్పారు. పత్తి పంట కొనుగోలు విధానాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. అంతకుముందు పత్తి పంట కొనుగోలు ప్రారంభోత్సవానికి వచ్చిన కలెక్టర్, ఎమ్మెల్యేలకు జిన్నింగ్ మిల్లు నిర్వాహకులు కేదార్నాథ్, పడిగెల సంతోష్‌లు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమభీమ్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రైతును ముంచిన తుఫాను

▸▸ జిల్లాలో పంటలకు భారీ నష్టం
▸▸ పత్తి పరిస్థితి దయనీయం
▸▸ కొనుగోలు కేంద్రాలు లేక సోయా రైతులకు చిక్కులు

మొన్నటి వరకు వర్షాకాలం సీజన్ ముగిసిన తరువాత కూడా అకాల వర్షాలు రైతులను ఆగం చేయగా రెండు రోజుల క్రితం నుంచి మొదలైన మొంథా తుపాను ప్రభావిత వర్షాలు అన్నదాతను ముంచేశాయి. వాతావరణం ప్రకృతికి విరుద్ధంగా విరుచుకుపడుతున్న కారణంగా కొద్దిరోజుల నుంచి రైతులు తీవ్ర ఆందోళన కు గురవుతున్నారు. బుధవారం నుంచి గురువారం వరకు కురిసిన భారీవర్షంతో జిల్లాలో పత్తి, సోయాబీన్, వరిపంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చాలా చోట్ల పంటలన్నీ మరోసారి నీట మునిగాయి.

నిర్మల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటికే చేతికి వచ్చిన సోయాబీన్ పంటతో పాటు కోతకు వచ్చిన వరి, పత్తి పంటలు వర్షం కారణంగా తడిసి ముద్దయ్యాయి. ప్రస్తుతం ఈ పంటలన్నీ తమ సహజ ఏ గ్రేడ్‌ను కోల్పోయి బి బీ గ్రేడ్ రకం స్థాయికి పడిపోవడం అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తోం ది. ముఖ్యంగా సోయాబీన్ పంటల పరిస్థితి దయనీయంగా మారింది. ఇప్పటికే సోయాబీన్ పంట అంతా చేతికి వచ్చిన సంగతి తెలిసిందే. కోతలన్నీ పూర్తవ్వడంతో రైతులు సోయాబీన్ పంటను అమ్ముకునేందుకు సిద్ధమవుతున్న క్రమంలోనే ప్రస్తుతం వారి ఆశలను వమ్ము చేసింది. ఆరుబయట ఆరబెట్టిన సోయా పంట అంతా తడిసి ముద్ద కావడంతో ఆ పంటపై ఆశపెట్టుకున్న రైతులకు కోలుకోలేక దెబ్బ తగిలిందని అంటున్నారు. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేం ద్రాలను ఏర్పాటు చేయని కారణంగా చాలా మంది రైతులు సోయాపంటను నిల్వ ఉంచుకున్నారు. అయి తే మరికొంతమంది రైతులు తక్కువ ధరకే సోయా పంటను మధ్య దళారులు, వ్యాపారులకు అమ్ముకొని నష్టపోయారు. పంటను నిల్వఉంచుకున్న రైతులు మాత్రం వర్షం నిండా ముంచేసింది. కాగా నిర్మల్ జిల్లాలో దాదాపు లక్షా 16వేల ఎకరాల్లో ఈ సారి రైతులు సోయాబీన్ పంటను సాగు చేశారు. మొదట్లో దిగుబడులు పెద్దఎత్తున వస్తాయ ని వారంతా ఆశించారు. అయితే మొదటి నుంచి సోయాబీన్ పంటను వర్షం వెంటాడుతోంది. మొదట్లో కురిసిన భారీవర్షాలతో చాలా చోట్ల సోయా పంట నీట మునిగిపోయింది. మళ్ళీ కురిసిన వర్షాలతో సోయాపంట అంతా వర్షార్పణం అయింది. అయితే ఇప్పటికే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఉన్నట్లయితే రైతులు తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకునే వారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయని కారణంగా ఆ కొనుగోలు కేంద్రాల కోసం ఎదురుచూస్తున్న రైతులు పంట మొత్తం తమ వద్దనే నిల్వ ఉం చుకున్నారు. ఈ నేపథ్యంలోనే వర్షం నిల్వ ఉంచిన సోయాపంటను అంతా నీటి పాలు చేసింది. ప్రస్తు తం ఈ పంట అంతా బీ గ్రేడ్ కన్నా దిగువ స్థాయికి పడిపోయింది. తడిసిన సోయాబీన్ పంటను అంతా ప్రభుత్వమే కొనుగోలు చేయాలంటూ రైతులు ఆందోళనకు దిగుతున్నారు. ఇప్పటికే కుంటాల మండలంలో రైతులు పెద్దఎత్తున ధర్నా చేపట్టి మద్దతు ధరతో తడిసిన సోయాబీన్ పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



భావాపూర్ మార్కెట్ యార్డ్‌లో తడిసి ముద్దయిన వరి ధాన్యం



నిర్మల్, మంచిర్యాల రహదారిపై తర్లపాడ్ సమీపంలో కూలిన కల్వర్టు

పత్తి రైతు కుదేలు



తడిసిపోయి పైరు నుంచి జారిపోతున్న పత్తి

భైంసా, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో అతలాకుతలం అవుతున్న పత్తి రైతాంగం మొంథా తుపాను దెబ్బకు పూర్తిస్థాయిలో కుదేలయింది. కోలుకోలేని రీతిలో కష్టనష్టాలపాలయింది. ప్రకృతి పరిహాసం చేస్తుండడంతో అన్నదాత పరితాపం చెందుతున్నాడు. మొంథా తుపాను ప్రభావంతో ప్రస్తుతం రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీవర్షాలతో పత్తి పంట దిగుబడులపై రైతులు పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలయ్యాయి. సాగుకు పెట్టిన పెట్టుబడులు సైతం చేతికి వచ్చే పరిస్థితులు లేకుండా పోయాయి. అధికంగా కురుస్తున్న వర్షాలతో తెల్ల బంగారు పిం జలు దెబ్బతిని నల్లబడిపోతున్నాయి.

▸▸ జిల్లాలో 1.46 లక్షల ఎకరాల్లో పత్తిసాగు

జిల్లా వానకాలపు సీజన్‌లో జిల్లాలోని నాలుగు వ్యవసాయ డివిజన్ల పరిధిలో మొత్తం దాదాపు 56 వేలకు పైగా మంది రైతులు 1.46 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశారు. అత్యధికంగా భైంసా, ముథోల్ వ్యవసాయ డివిజన్ల పరిధిలో పత్తిను అధికంగా పండించారు. అయితే విత్తనాలు విత్తే సమయంలో వాతావరణం అనుకూలించకపోయినా తదుపరి అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో పత్తిపంట ఆశాజనకమైన స్థితికి చేరింది. పంట పరిస్థితి మెరుగ్గా ఉండటంతో దిగుబడులపై అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా



కుంటాలలో రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

కుంటాల, అక్టోబరు, 30 : (ఆంధ్రజ్యోతి) : సోయా పంట కోత కోసి దాదాపు 20 రోజులకు పైగా గడిచినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించినందుకే బుధవారం రాత్రి కురిసిన వర్షానికి స్థానిక కొనుగోలు కేంద్రంలో కుప్పలు పోసిన సోయాలు తడిసి ముద్దయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు బుధవారం ఉదయం మండల కేంద్రం కుంటాలలో కల్లూరు- కుంటాల రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లు ప్రారంభించి తడిసిన ధాన్యాన్ని సైతం తేమ శాతంతో సంబంధం లేకుండా వెంటనే కొనుగోలు చేపట్టాలని కోరుతూ రహదారిపై బైఠాయించారు. కొనుగోళ్లు చేపట్టాలని కోరుతూ ధర్నా నిర్వహించిన రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

అన్ని పంటలకు నష్టం

లోకేశ్వరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి లోకేశ్వరం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో రైతన్నకు దుఃఖాన్ని మిగిల్చింది. కష్టపడి పండించిన పంటలు మొక్కజొన్న, సోయా, పత్తి, వరి పంటలు అకాల వర్షాలతో అధికంగా పంట నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన పంట కళ్లముందే పనికి రాకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే సోయా, మొక్కజొన్న, పత్తి, వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే ఈ బాధలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తపరిచారు. ఇకముందైన కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని రైతులు అధికారులకు విన్నవిస్తున్నారు.

ముథోల్‌లో భారీ నష్టం



ముథోల్‌లో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

ముథోల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలు రైతులను తీవ్రంగా నష్టపరిచాయి. మండలంలో 104.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలకు వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇప్పటికే కోతకు సిద్ధంగా ఉన్న పంటలు తడిసిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో నీరు నిలిచి ఉండటంతో పంటలు పాడైపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్లాల్లో ఎండబెట్టిన మొక్కజొన్న వరిధాన్యం తడిసిపోయాయి. ఎన్ని టార్పాలిన్‌లు కప్పిన దిగుబడులు తడిసిపోయాయని దీంతో నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఇప్పటికి ప్రారంభించకపోవడంతో కల్లాల్లోనే దిగుబడులు తడిసిపోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో కురిసిన వర్షం కారణంగా ఆయా ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. మరికొన్నిప్రాంతాల్లో దిగుబడులు తడిసిపోయా యి. వర్షం కారణంగా రైతుకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు పేర్కొంటున్నారు. మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో గల చెరువు కింద ఉన్న వరిపొలాలు వర్షం నీటితో నీటమునిగాయి. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని మండల రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే నష్టాలను అంచనా వేసి, తగిన పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని బస్టాండ్ సమీపాన వర్షపు నీరు నిలిచిపోయి చెరువులను తలపించింది.

కల్లాల్లో తడిసి ముద్దయిన ధాన్యం

ఖానాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బుధవారం సాయంత్రం నుంచి గురువారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈ వర్షం దాటికి పలుచోట్ల పత్తి, వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. చివరి దశకు చేరిన వరి పంట పూర్తిగా వంగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షంతో ఇప్పటికే కోతదశకు చేరిన పంట పొలాలలో హార్వెస్టర్లు నడవలేని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతలు పూర్తయి ధాన్యాన్ని విక్రయించేందుకు ఖానాపూర్‌లోని మార్కెట్ యార్డ్‌కు తరలించిన ధాన్యమంతా ఈ వర్షానికి తడిసి ముద్దయింది. టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచినప్పటికీ వర్షపు నీరంతా ధాన్యం రాశుల కిందకు వెళ్లడంతో ధాన్యమంతా వరద నీటిలో కొట్టుకుపోయింది. దీంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం రాత్రి నిర్మల్, మంచిర్యాల రహదారిపై తర్లపాడ్ సమీపంలో ఓ కల్వర్టు కూలిపోయింది. దీంతో ఈ ప్రదాన రహదారిపై రాకపోకలకు భారీ వాహనాలకు ఇబ్బంది కలిగింది. కల్వర్టు కూలిపోయి నడిరోడ్డుపై పెద్ద గుంత పడడంతో వేగంగా వచ్చే వాహనాలకు ప్రమాదం బారిన పడే పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు తగ్గుముఖం పట్టగానే యుద్ధ ప్రాతిపదికన కల్వర్టుకు మరమ్మతులు చేయిస్తామని ఆర్‌అండ్‌బీ డీఈఈ మసూద్ తెలిపారు. సదర్మాట్ వద్ద భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో వరద ఉధృతిని తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో రత్నాకర్ రావులు పరిశీలించారు.

గడ్డెన్న వాగు ప్రాజెక్టు నీటి విడుదల



సుద్దవాగులోకి వదిలివేసిన వరద నీరు

భైంసా, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీవర్షాల మూలంగా గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి అధికంగా వరద నీరు వచ్చి చేరుతోంది. బుధవారం సాయంత్రం ప్రారంభమైన వరద నీటి చేరిక గురువారం సైతం కొనసాగింది. ఈ క్రమంలో ప్రాజెక్టు నిర్వహణాధికారులు వరద నీటి చేరికకు అనుగుణంగా దిగువన ఉన్న సుద్దవాగులోకి నీటిని వదిలిపెట్టారు. గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ప్రాజెక్టులోకి 18 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టుకు సంబంధించిన రెండు వరద గేట్లను ఎత్తివేసి సుద్దవాగులోకి 17,500 క్యూసెక్కుల వరద నీటిని వదిలిపెట్టారు. దీంతో భైంసా పట్టణ సరిహద్దు ప్రాంతంలోని సుద్దవాగు బైపాస్ వంతెన మీదుగా కొద్దిమేర నీరు ప్రవహించడంతో రెండు గంటలకు పైగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

కడెం ప్రాజెక్టు రెండు వరద గేట్లు ఎత్తివేత



నీటిని వదులుతున్న దృశ్యం

కడెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు కడెం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతున్నందున 2 వరద గేట్లు ఎత్తివేసి దిగువకు నీరు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 14,932 క్యూసెక్కులు రావడంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు 2 గేట్లు ఎత్తివేసి దిగువకు ఔట్‌ఫ్లో 16,704 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కడెంప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 700ల అడుగులు కాగా, ప్రస్తుతం నీటి మట్టం 699.875 అడుగులు ఉందని, గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

నేలకొరిగిన వరి పంట

సారంగాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సారంగాపూర్ మండలంలో చించోలి(బి)లో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చేతికి వచ్చిన వరి పంట నేలకొరిగింది. దీంతో ఆరుగాలం కష్టపడి శ్రమించి పండించిన వరి పంట చేతికి వచ్చిన సమయంలోనే నేలకొరవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నేలకొరిగిన వరి పంటను చూసి రాజు అనే రైతు కన్నీరు మున్నీరయ్యారు. ఇప్పటికైనా పాలకులు సంబంధిత అధికారులు కురిసిన వర్షానికి నష్టపోయిన పంట పొలాలకు సర్వే నిర్వహించి రైతులను ఆదుకోవాలని కోరారు.



ప్రశంస పత్రాలు అందిస్తున్న కలెక్టర్

నవజాత శిశు సంరక్షణపై వైద్య సిబ్బందికి శిక్షణ

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నవజాత శిశు మరణాలను తగ్గించేందుకు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన నవజాత శిశు సంరక్షణ శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నవజాత శిశు మరణాల రేటును సింగిల్ డిజిట్ స్థాయికి తగ్గించడం లక్ష్యంగా శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. శిక్షణను ఐసీఎంఆర్, ఎయిమ్స్, బిల్, మెలిండా గేట్స్ ఫౌండేషన్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించాయని తెలిపారు. మూడు రోజుల పాటు సాగిన శిబిరంలో 300 మంది వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి శిక్షణ అందించారని, రాబోయే ఏడాది పాటు సంస్థలు సాంకేతిక సహాయం అందించనున్నాయని వివరించారు. శిక్షణలో నవజాత శిశు పునరుద్ధరణ, తల్లిపాలు అందించే ఉత్తమ పద్ధతులు, శిశు సంరక్షణకు సంబంధించిన తాజా వైద్య విధానాలపై నిపుణులు ప్రాయోగికంగా అవగాహన కల్పించారని తెలిపారు. అనంతరం శిక్షణలో ప్రతిభ కనబరిచిన వైద్యులు, సిబ్బందిని కలెక్టర్ ప్రశంసిస్తూ ప్రశంసా పత్రాలు, బహుమతులు, స్మారక చిహ్నాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమ నిర్మాణానికి భూమిపూజ

నేరడిగొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్టి గ్రామంలో రూ.4లక్షలతో చేపడుతున్న శబరిమాత ఆశ్రమ నిర్మాణానికి గురువారం ఆడే గజేందర్ భూమిపూజ చేశారు. మండలంలోని కుప్టి గ్రామంలోగల శబరిమాత ఆశ్రమ నిర్మాణానికి 4లక్షలు నిధులు మంజూరు చేయించినందుకు ఆడే గజేందర్‌ను గ్రామస్థులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఆడే వసంత్ రావు, కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, బోథ్ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ నారాయణ గౌడ్, తదితరులున్నారు.

గజేందర్‌ని కలిసిన కాంగ్రెస్ నాయకులు

సిరికొండ, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ని గురువారం సిరికొండ మండల కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా సిరికొండ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ రంజాన్ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

మావల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఫ్రెషర్స్ డే ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి డీఎస్‌హెచ్‌వో నర్సయ్య ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. హార్టికల్చర్ డిప్లొమా శిక్షణ నైపుణ్యంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని అన్నారు. అనంతరం మావల సీఐ కె. స్వామి మాట్లాడుతూ పిల్లలో మొబైల్‌ఫోన్ల వాడకంతో జరిగే దుష్పరిణామాలను వివరించారు. అదేవిధంగా యుక్తవయసులో కలిగే వ్యసనాలతో పిల్లలు వారి భవిష్యత్తుని ఎలా కోల్పోతున్నారో తెలియచేశారు. పూర్వవిద్యార్థులకు డి.నర్సయ్య చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ నాబార్డు మేనేజర్‌లు, వీరభద్రులు, షేక్‌అబ్దుల్ రావూఫ్, వైస్ ప్రిన్సిపాల్, డా.వి.మురళీ పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం


నాగాపూర్‌లో తడిసిన ఆరబోసిన సోయాబీన్


వర్షానికి తడిసి నల్లగా మారిన సోయాబీన్ పంట

ఉట్నూర్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ఏజెన్సీలోని పంటలకు అపార నష్టం వాటిల్లింది. ఉట్నూర్ మండలంలోని నాగపూర్, శాంపూర్, దుర్గాపూర్, ఎంకా, వడోని, ఉమ్రి, సాలెగూడ, నర్సాపూర్(బి), జైత్‌రామ్‌తండా, పులిమడుగు, సాలెవాడ(కె) (బి), తాండ్ర, రాజన్నగూడ, ఓర్వాడి తదితర ప్రాంతాలలో పత్తి పంటకు తీవ్ర నష్టం ఏర్పడింది. నాగపూర్ ప్రాంతంలో మాత్రమే రైతులు సోయాబీన్ పంట పండించగా దిగుబడి రాలేదని, వచ్చిన పంటను ఆరబెడుతుంటే అకాల వర్షం మట్టి కలిపించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగాపూర్ చెరువు ప్రాంతంలో కొందరు రైతులు పండిస్తున్న వరి ధాన్యం పంట దెబ్బ తిన్నది. సోయాబీన్ పంటను గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ఆరబోసిన రైతుల సోయాబీన్ పంట తడిసి ముద్దయింది. నాగపూర్ ప్రాంతంలో 50 ఎకరాలకు పత్తి పంట నష్టం జరిగి ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. మండలంలోని దంతనపల్లి, కొత్తగూడెం, గన్‌పూర్ ప్రాంతాలలో ఆరబోసిన ధాన్యం తడిచిపోయిందని రైతులు వివరించారు. ఈ ఏడాది అతివృష్టి వల్ల పంటలు అంతంత మాత్రమే పండగా పత్తి పంటపై ఆశలు పెంచుకున్న మొంథా తుపాను ప్రభావంతో కురిసిన అకాల వర్షం ఏజెన్సీ ప్రాంత రైతులకు సైతం నష్టం కలిగించింది. ప్రభుత్వం అకాల వర్షానికి నష్టపోయిన రైతుల పంటలు సర్వేచేయించి పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


చింతలబోరి రైతుకు పాస్‌బుక్ అందిస్తున్న తహసీల్దార్

ఎనిమిదేళ్ల సమస్యకు పరిష్కారం

- భూభారతితో పాస్‌బుక్ జారీ

బోథ్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): గత ఎనిమిదేళ్లుగా పాస్‌బుక్‌కు నోచుకొని రైతుకు భూభారతితో పట్టాదారు పాస్‌బుక్కు లభించింది. గ్రామానికి చెందిన రైతు దిగులే బాబురావు తనకు పాస్‌బుక్ ఇవ్వాలని ఎనిమిదేళ్లుగా అధికారులను కోరుతున్నాడు. అయితే భూభారతి చట్టంతో జిల్లా కలెక్టర్ చొరవతో సమస్యకు పరిష్కారం లభించిందని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు. దీంతో గురువారం పాస్‌బుక్ అందుకున్న రైతు హర్షం వ్యక్తపరిచారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

నేరడిగొండ, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. గురువారం మండలంలోని బుర్కపల్లి గ్రామంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాలను ఏర్పాటుచేసి, పశువులకు టీకాలువేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పశు పోషణపై కూడా దృష్టి సారించాలని అన్నారు. పశువులకు సోకే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బందితోపాటు రైతులు పాల్గొన్నారు

సమాజంలో అందరూ సమానులే..

బోథ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అందరూ సమానులేనని, ఎవరిపట్ల కూడా వివక్ష చూపొద్దని సోనాల తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ పేర్కొన్నారు. గురువారం గ్రామంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టిలో అందరూ సమానులేనని అన్నారు. గతంలో కొంతమందిని అంటరాని వారుగా చూసేవారని, హోటల్‌లో ప్రత్యేకమైన గ్లాసులు పెట్టేవారని వివరించారు. ఇప్పుడు రోజులు మారాయని అన్నారు. ఆ విధంగా వ్యవహరించడం చట్టరీత్యా నేరమని చెప్పారు.

విద్యార్థుల కోసం తయారు చేస్తున్న వంటలను పరిశీలిస్తున్న అధికారులు



కొలాం ఆశ్రమ పాఠశాల తనిఖీ

ఆదిలాబాద్‌టౌన్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొలాం ఆశ్రమ పాఠశాలను ఉట్నూర్ డీడీ అంబాజీ జాదవ్ గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. పాఠశాలలో టాయిలెట్స్, వంటగది, విద్యార్థుల భోజనాలు, స్టోర్ రూమ్, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడి వారికి దిశ నిర్దేశం చేశారు. నవంబరు 1 నుంచి ప్రతీరోజు పరీక్షలు ఉంటాయని, ప్రణాళిక ప్రకారం చదువుతూ ప్రతిభ కనబర్చాలని సూచించారు. ఆయనవెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ రావు, వార్డెన్ ప్రభాకర్, సీఆర్‌టీలు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై కాంట్రాక్టర్ల పెత్తనం

(5వ పేజీ తరువాయి...)

ఇంటి నిర్మాణ ధరలను నిర్ణయిస్తూ లబ్ధిదారులను నిలువు దోపిడీ చేస్తున్నా అడిగే వారే కరువవుతున్నారు. అన్ని రకాలుగా అంచనాలు వేసిన తర్వాతే ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల నిధులను మంజూరు చేస్తుంది.కాని ఈ నిధులు ఏ మూలన సరిపోవంటూ కొర్రీలు పెడుతు అదనంగా దండుకుంటున్నారు. సేవా ముసుగులో కొంత సొమ్మును జేబులో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇండ్ల మంజూరుతో పాటు బిల్లుల మంజూరు, ఇతర ఇబ్బందులు తలేత్తకుండా చూస్తామంటూ నమ్మబలుకుతున్నారు.అమాయక నిరుపేదలైనా లబ్ధిదారులు నేతలను నమ్మి మోసపోతున్నారు.నాణ్యత ప్రమాణాలు పాటించకుండానే ఇంటి నిర్మాణాలను చేపడుతున్నా అధికారులు మాత్రం అడ్డు చెప్పడం లేదంటున్నారు. పదికాలాల పాటు పదిలంగా ఉండాల్సిన ఇందిరమ్మ ఇళ్ల నాణ్యతపై పలుచోట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను దక్కించుకుంటున్న పలువురు కాంట్రాక్టర్లు ముందుచూపుతో వ్యవహరిస్తున్నారు. లబ్ధిదారులతో ముందే ఒప్పందం చేసుకుంటు అగ్రిమెంట్ పేపర్ రాసుకుంటున్నారు. దాని ప్రకారమే డబ్బులు ఇవ్వాలంటూ లబ్ధిదారులపై తీవ్ర ఒత్తిళ్లు చేస్తున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి 2నుంచి 3లక్షల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇంటి నిర్మాణ విస్తీర్ణం, మెట్లు, ఇతర వసతులను బట్టి ధరలను పెంచేస్తున్నారు. అలాగే సిమెంట్, ఇటుకకు ఓ రేటు, మట్టి ఇటుకకు మరో రేటును నిర్ణయిస్తున్నారు. దర్వాజలు, కిటికీల సైజులు, నంబ్యను బట్టి కూడా అదనంగా వసూలు చేస్తున్నారు.కాదు కూడదంటే ఒప్పంద పత్రాలను చూపుతున్నారు.లబ్ధిదారులే కొన్ని రకాల ఇంటి నిర్మాణ పనులను కూడా చేస్తున్నారు. అయినా ఒప్పుకున్న ప్రకారం డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు.

కొందరికే రుణాలు

ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం అడ్వాన్సుగా బ్యాంకు లింకేజి రుణాలను అందిస్తుంది. కానీ అవగాహన లేకపోవడంతో రుణాలు తీసుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. జిల్లాలో 5,338 మంది లబ్ధిదారులు బ్యాంకు రుణాల కోసం దరఖాస్తులు చేసుకోగా ఇప్పటి వరకు 884 మంది లబ్ధిదారులు మాత్రమే 50వేల నుంచి లక్ష వరకు బ్యాంకుల ద్వారా రుణాలను పొందారు. మిగితా లబ్ధిదారులు రుణాల కోసం బ్యాంకుల చుట్టు చక్కర్లు కొడుతున్నారు. దీన్ని బట్టి చూస్తుంటే జిల్లాలో పరిస్థితి ఎలా ఉందో తెలుస్తునే ఉంది. ఇంటి నిర్మాణానికి అవసరమైన డబ్బులు చేతిలో లేక పోవడం తోనే నిర్మాణ పనులు నిలిచిపోతున్నట్లు తెలుస్తుంది.ఇకనైనా రుణాలు అవసరమైన లబ్ధిదారులను గుర్తించి రుణాలను మంజూరు చేస్తే దళారులు, కాంట్రాక్టర్ల బెడద తప్పే అవకాశం ఉందంటున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నేరడిగొండ, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): నేరడిగొండ మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుమారు 50 మంది బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంతరావు కుమారి, ప్యాక్స్ చైర్మన్ మందుల రమేష్, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన


నేరడిగొండ, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రతీ గ్రామంలో పండగల జరుగుతున్నాయని, ప్రతీ పేదవాడి సొంతింటి కల నెరవేరుతుందన్నారు. ఆయనవెంట బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఆడే వసంత్ రావు, కుమారి పాక్స్ చైర్మన్ మందుల రమేష్, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

షిరిడీకి పాదయాత్రగా బయలుదేరిన భక్తులు


షిర్డీకి బయలుదేరిన సాయిబాబా భక్తులు

నిర్మల్‌చైన్‌గేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని గండి రామన్న సాయిబాబా ఆలయం నుంచి గురువారం పలువురు భక్తులు షిర్డీకి పాదయాత్రగా బయలుదేరారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. మొత్తం 15 మందితో కూడిన బృందం 15 రోజులపాటు కాలినడకన వెళ్లి షిర్డీలోని సాయినాథుడిని దర్శించుకుంటారని ఏర్పాట్లను పర్యవేక్షించిన సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి తెలిపారు. 11 ఏండ్లుగా ప్రతి సంవత్సరం దత్త జయంతిని పురస్కరించుకొని ఈ పాదయాత్రను నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. కార్యక్రమంలో జగన్మోహన్‌రెడ్డితో పాటు సాయి దీక్ష సేవా సమితి సభ్యులు జొన్నల మనోహర్, జిందం గోవర్ధన్, ఉప్పుల నందు, కోలా శంకర్, శ్రీనివాస్, ప్రకాష్‌గౌడ్, రాజేష్, జైపాల్‌రెడ్డి, కొప్పుల లక్ష్మణ్, పరమేశ్వర్, రాజు, కళ్యాణి, లక్ష్మీ, నవ్యశ్రీ, శకుంతల పాల్గొన్నారు.

పాఠశాలల వివరాలు పొందుపరచాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల విద్యాధికారి

సోన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో గల మౌలిక వసతులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు, విద్యా ప్రమాణాల గురించిన సమగ్ర వివరాలను యూడైస్ పోర్టల్‌లో ఖచ్చితంగా పొందురచాలని మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... పాఠశాలల సమగ్ర వివరాలు పొందుపరచడం ద్వారా పాఠశాలల అభివృద్ధితో పాటు మౌలికవసతుల కల్పన, విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంపొందించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రణాళిక సెక్టోరల్ అధికారి రాజేశ్వర్, మండలంలోని కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముథోల్ నయాబాదిలో తనిఖీలు

ముథోల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని నయాబాదిలో గురువారం వేకువజామున పోలీసులు భారీ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ముథోల్ సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో పోలీసు బృందాలతో కలిసి ఈ సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా మొత్తం 31 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలు, 6 ఫోర్‌వీలర్లను పత్రాలు లేని కారణంగా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మల్లేష్ మాట్లాడుతూ... చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిని గుర్తించడమే లక్ష్యమని తెలిపారు. పత్రాలు లేని వాహనాలు, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, సమాజ శాంతిభద్రతల కోసం పోలీసులు ఎల్లప్పుడు కృషి చేస్తారన్నారు. వాహన నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. చిన్న పిల్లలకు వాహనాలను ఇవ్వకూడదని అన్నారు. కార్యక్రమంలో ముథోల్ ఎస్సై బిట్ల పెర్సిస్, తానూర్ ఎస్సై జుబేర్, లోకేశ్వరం ఎస్సై అశోక్, బాసర ఎస్సై శ్రీనివాస్, గంగాధర్‌తో పాటు సుమారు 30 మంది సిబ్బంది పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు


సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలేటి

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఏఎంసీ మార్కెట్‌యార్డ్‌లో ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ5,328 ఉందని, దళారులను నమ్మి మోసపోకుండా రైతులు ఈ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ కిషోర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు మేడిసెమ్మె రాజు, ముత్యంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యం చంద్రకాంత్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. సోయాబీన్‌కు ప్రభుత్వం క్వింటాలుకు రూ. 5328 మద్దతు ధరను ప్రకటించిందని రైతులు కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలో గత రైతువేదికలో షాదీముబారక్ కల్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరిపే విలాస్, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకాంత్, మండల అధ్యక్షులు కొల్వ నరేష్, నాయకులు చంద్రప్రకాష్‌గౌడ్, ముత్యంరెడ్డి, రాజేందర్ రెడ్డి, రాంశంకర్ రెడ్డి, సాహెబ్‌రావు, గంగారెడ్డి, జమాల్ పోతన్న పాల్గొన్నారు.

నర్సాపూర్(జి) : మండలానికి చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శాసన సభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి దిలావర్‌పూర్ మండలంలోని పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, బీజేపీ మండల అధ్యక్షులు నరేందర్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండలంలో మహాప్రసిద్ధిగాంచిన అడెల్లి మహా పోచమ్మ గురువారం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మొక్కులను మొక్కి పూజలు చేశారు. ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఏర్పాట్లను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

దిలావర్‌పూర్ : మండల కేంద్రంలో సోయా, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గురువారం సాయంత్రం ప్రారంభించారు. తక్కువ ధరకు అమ్మి మోసపోవద్దని సూచించారు.

రైతులు అధైర్యపడొద్దు

- మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం


కుంటాలలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ అప్క, గజ్జారాం

కుంటాల, అక్టోబరు, 30 : (ఆంధ్రజ్యోతి) : రైతులు అధైర్య పడవద్దని మాజీ ఎంపీపీ అప్కగజ్జారాం యాదవ్ అన్నారు. గురువారం ఆయన కుంటాలలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు పండించిన అన్ని రకాల ధాన్యాలను కొనుగోలు చేసి మద్దతు ధర అందించేందుకు సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే రామరావు పటేల్ రైతుల సమస్యలపై ఇప్పటికే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు నియోజకవర్గ రైతుల పరిస్థితిని వివరించి బుధవారం రోజు ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలను భైంసా మార్కెట్‌లో ప్రారంభించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే రామరావు పటేల్ ఎల్లవేళలా రైతుల పక్షాన ఉంటూ రైతులకు అన్యాయం జరిగితే ఉరుకోబోరన్నారు. మండల కేంద్రంలో తాము కూడా ఎల్లవేళలా రైతులకు సహాయం చేసేందుకు అందుబాటులో ఉంటూ ఇక్కడి పరిస్థితిని ఎప్పటికప్పుడు ఎమ్మెల్యేకు వివరిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో రైతులకు సంబంధించిన అన్ని రకాల పంటలను కొనుగోళ్లు చేపట్టేలా ఎమ్మెల్యే రామరావు పటేల్ అన్ని రకాలుగా అండగా ఉంటారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పసుల నవీన్, మంగలి గజేందర్, ప్రణయ్ రావు, మహేష్, పలువురు రైతులు, తదితరులు ఉన్నారు.

నగరాభివృద్ధి పనులపై సమీక్ష


అధికారులతో మాట్లాడుతున్న ముథోల్ ఎమ్మెల్యే

భైంసా, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధి పథకంలో భాగంగా భైంసా పట్టణ పరిధిలో మంజూరైన వివిధ అభివృద్ధి పనుల్లో మార్పులు, చేర్పులు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ ఆదేశించారు. గురువారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, ఇంజనీరింగ్ అధికారులతో నగరాభివృద్ధి మంజూరు పనుల వివరాలపై సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. భైంసా పట్టణానికి నగరాభివృద్ధి కింద రూ.15 కోట్లతో 14 అభివృద్ధి పనులు మంజూరైనట్లుగా మున్సిపల్ అధికారులు వెల్లడించారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా మరో రూ.3.75 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను ప్రతిపాదనలు పంపాల్సి ఉందని వివరించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ నగరాభివృద్ధి పథకం కింద మంజూరైన అభివృద్ధి పనుల వివరాలను పరిశీలించారు. మంజూరైన అభివృద్ధి పనుల్లో మార్పులు, చేర్పులు చేపట్టాలని సూచించారు. నగరాభివృద్ధి కింద పట్టణ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పనులు చేపట్టాలని పేర్కొన్నారు. టిప్పు సుల్తాన్ చౌక్‌నుంచి పట్టణ పోలీసుస్టేషన్, కిసాన్‌గల్లి, పురాణాబజార్, బ్రాహ్మణ్‌గల్లి, గుజిరిగల్లి, సోనార్‌గల్లి, పంజేషా చౌక్, మెడికల్ చౌక్, కాపాడ మార్కెట్, మున్సిపల్ రోడ్డు, మార్కెట్ కమిటీ రోడ్డు వరకు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేపట్టేందుకు గాను ప్రతిపాదనలు రూపొందించి మంజూరు కోసం గాను ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో 2కే రన్

లోకేశ్వరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంలో శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఏక్తా దివస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు లోకేశ్వరంలోని భగత్ సింగ్ చౌక్ నుంచి మోడం ఎక్స్ రోడ్ వరకు 2కే రన్ నిర్వహించారు. అందరూ గ్రామ ప్రజలు, యువతి యువకులు కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. అదేవిధంగా దీన్ని విజయవంతం చేయాలని లోకేశ్వరం ఎస్సై జి. అశోక్ సమావేశంలో తెలిపారు.

వెంకటాపూర్ గ్రామ బీసీ జేఏసీ కమిటీ ఎన్నిక

ముథోల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని వెంకటాపూర్ గ్రామ బీసీ జేఏసీ కమిటీని గురువారం ఏర్పాటు చేసినట్లు ఆ కమిటీ సభ్యులు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా బుద్దల్‌వార్ శ్రీనివాస్, అధ్యక్షుడు సాయిలు, ఉపాధ్యక్షుడు ఎస్.రాజు, ఎం.రాములు, కోశాధికారిగా గుండేవార్ రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాజు, సహాయ కార్యదర్శి బి.శేఖర్, సలహాదారులుగా ఎస్.అశోక్, ఎస్.ముత్యం, టి.భోజేందర్, కే.గంగా శేఖర్, కే.సాయి ప్రసాద్‌లు ఎన్నికైనట్లు తెలిపారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి

లోకేశ్వరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరని లోకేశ్వరం మండల విద్యాధికారి బి.చంద్రకాంత్ అన్నారు. పుస్పూర్ ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం జుట్టు మహేందర్ పదవీ విరమణ వీడ్కోలు సమావేశం గురువారం పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి బి.రమణారావు, నరేంద్రబాబు, సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్ర ప్రకాష్‌గౌడ్, మండల పీఆర్టీయూ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి రాజేందర్, రాజారాం, పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ కపాస్‌పై అవగాహన

నిర్మల్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముజ్గి గ్రామంలో కిసాన్ కపాస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు చిట్యాల క్లస్టర్ ఏఈవో అంబాజీ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పత్తి పంట సాగు చేస్తున్న రైతులందరూ ఈ సీజన్ నుండి పత్తిని సీసీఐ కేంద్రాల్లో అమ్మాలంటే ముందుగా కిసాన్ కపాస్ మొబైల్ యాప్‌లో తమ మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయి స్లాట్ బుకింగ్ చేసుకొని, జిన్నింగ్ మిల్లుకు నిర్దేశించిన తేదీకి పత్తిని తీసుకెళ్లి విక్రయించాలని తెలిపారు. స్లాట్ బుకింగ్ ఎలా చేసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించడం జరిగింది. పంట నమోదు విస్తరణ అధికారి దగ్గర మొబైల్ నెంబర్ సరిచేసుకోవాలని చెప్పడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నరిత, ఆత్మ డైరెక్టర్ రవి, ముత్యం, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రాంరావ్ మహరాజ్ వర్ధంతి

కుభీర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుభీర్‌లో గురువారం గిరిజనుల ఆరాధ్య దైవం ఆధ్యాత్మిక గురువు రాంరావ్ మహరాజ్ 3వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి సుదాం మాజీ ఎంపీటీసీ వసంత్, డాక్టర్ శివరాం, గజానంద్, దేవా, నందీప్, కృష్ణ, పలువురు పాల్గొన్నారు.


కుభీర్‌లో పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

వర్షంతో కష్టాలు



బజార్ హత్నూర్‌లో వర్షంలో కొనసాగుతున్న వారసంత

బజార్‌హత్నూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):అకాల వర్షాలతో ఏడాది పాటు పండించే పంటలపై తీవ్ర ప్రభావం చూపుతుండగా..వారానికి సరిపడా సరుకులు కొనే వారికి కూడా వర్షంతో కష్టాలు తప్పడం లేదు. వర్షం వల్ల మార్కెట్లకు వచ్చే సరుకుల సరఫరా తగ్గి, ధరలు పెరిగాయి. గత రెండు రోజులుగా తుఫాను ప్రభావంతో వర్షం కురుస్తోంది. దీంతో బజార్ హత్నూర్ మండల కేంద్రంలో గురువారం వారసంతపై తీవ్ర ప్రభావమే చూపింది. ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి వార సంతలో ప్రజలు హైరానా పడాల్సి వచ్చింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏడతెరపి లేకుండా కురిసిన వర్షానికి గ్రామీణులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వర్షానికి దుకాణాలపై టార్పాలిన్లు, కటీరాలు ఏర్పాటు చేసినా వ్యాపారులు, గ్రామీణులు తడుస్తూ సంత నిర్వహించాల్సి వస్తోందని వాపోయారు.వర్షానికి మారుమూల గ్రామాలైన డెహ్రా, గిరిజాయి, ఉమార్ద,మాన్కపూర్,మోర్ఖండి వాగులు పొంగడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈవర్షాలతో చేతికి వచ్చిన పంటలు వర్షార్పణం అవుతుండగా.. మరో పక్క వారానికి సరిపడా సరుకులు కూడా తీసుకెళ్లలేని పరిస్థితి దాపురించిందని గ్రామీణులు బాధపడుతూ కన్పించారు.

ప్రజా రక్షణ కోసమే పోలీస్ : ఎస్సై అఖిల్



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎస్సై

నార్నూర్,అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి) : ప్రజల రక్షణ వారి భద్రతనే ముఖ్యమంటూ నిరంతరం వారి సేవలకే తాము ఉన్నామనే సేవలు అందించే విషయంలో ముందుంటామని ఎస్సైఅఖిల్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి గాంధీచౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అసలు బాసిన వీరులకు ఆత్మకు శాంతి చేకూరాలని నిత్యం వారి సేవలు ప్రజల్లో గుర్తుండేలా చేసే కార్యక్రమం అన్నారు. కార్యక్రమంలో దళిత రత్న అవార్డు గ్రహీత కోర్రైల మహేందర్, బాలాజీ కాంబ్లే, సాయి, గ్రామస్థులు, యువకులు, పోలీస్ సిబ్బంది క్రిష్ణ, స్వరాజ్ పాల్గొన్నారు

మురికి కాలువలో పడ్డ ట్రాన్స్‌ఫార్మర్

» విద్యుత్ సరఫరాకు అంతరాయం



గద్దె పై నుంచి మురికి కాలువలో పడ్డ ట్రాన్స్‌ఫార్మర్

బోథ్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ గద్దె కూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గద్దెపై నుంచి కింద పడ్డ ట్రాన్స్‌ఫార్మర్ మురికి కాలువల లోపల ఉండడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. దీంతో మండల కేంద్రంలోని మూడు కాలనీ వాసులకు విద్యుత్ సరఫరా నిలిచి పోయి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని కాలనీవాసులు తెలిపారు.



ఇచ్చోడ రైతు వేదిక భవనం





రైతువేదికలో లక్షల విలువైన కంప్యూటర్, టీవీ, స్పీకర్, ఇన్వర్టర్ పరికరాలు

నిర్వహణ లేదు.. భద్రత పట్టదు

» నిర్వహణకు ఇబ్బందులు.. పరికరాల భద్రతకుపై ఆందోళన

» అడుగు వేస్తే కుంగుతున్న టైల్స్

» విషపురుగులతో ప్రమాదకరంగా మారిన భవనాలు

» దళారుల వైపు మొగ్గు చూపుతున్న రైతులు



రైతువేదికలో ఉన్న విత్తన బస్తాలు

ఇచ్చోడ, అక్టోబరు, 30 (ఆంధ్రజ్యోతి): రైతువేదిక భవనాల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో రైతువేదిక భవనాలు అధ్వాన్నంగా తయారయ్యాయి. వేదికలోగల ఫ్లోర్ పగిలిపోయి తలుపులకు పెచ్చులూడడం, అలంకారప్రాయంగా మరుగుదొడ్లతో నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఇచ్చోడ మండల పరిధిలోని ఇచ్చోడ, తలమద్రి, సిరిచెల్మ, కోకస్‌మన్నూర్, నర్సాపూర్, మల్యాల వ్యవసాయ క్లస్టర్లలో 6 రైతు వేదికల్లోని 3చోట్ల టీవీ, శ్రవణ మాధ్యమం, ఇన్వెర్టర్ల వంటివి ఒక్కో చోట రూ. 4లక్షల విలువైన పరికరాలున్నాయి. రైతు వేదికల నిర్వహణకు నిధుల్లేక ఇబ్బందులు కొనసాగుతున్నాయి. రూ. 9వేలు నెల వారీగా నిర్వహణకు రావాల్సి ఉండగా దాదాపు 3ఏళ్లుగా ఒక్కరూపాయి కూడా రాక పోవడంతో రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారుల సమావేశాలు నిర్వహించేందుకు వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈఓ)లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని రైతు వేదికలు గ్రామ శివారు ప్రాంతాల్లో నిర్మించడంతో వర్షం పడితే వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కొన్ని రైతు వేదికల్లో గతంలో ఫ్యాన్లు, లైట్లు దొంగతనాలకు గురయ్యాయి. మండల పరిధిలో మొత్తం 261 శనగ విత్తన బస్తాలను రైతులకు అందించేందుకు రైతు వేదికల్లో లక్షల విలువగల విత్తన బస్తాలను వ్యవసాయశాఖ అధికారులు పంపిణీ చేస్తున్నారు. వాటిని చూసుకునేందుకు వాచ్‌మెన్ కూడా లేదు. ఇకనైనా రైతు వేదిక భవనాలపై ప్రభుత్వం దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు. రైతు వేదిక భవనాల్లో విషపురుగులు సైతం తాండవిస్తున్నాయి. ఇకా మరుగుదొడ్ల విషయం దేవుడేరుగు. కనీసం మరుగుదొడ్ల భవనంలో వేసిన టైల్స్ కుంగిపోయి పెద్దపెద్ద రంధ్రాలు పడి అధ్వాన్నంగా మారాయి రైతు వేదిక భవనాలు.అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలన్నారు.

బిక్కుపై దాడిని సహించేదిలేదు

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం ఆరోపణ



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం

నార్నూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలు భారతదేశ అభివృద్ధిని చూసి నివ్వెర పోతుందని అంతే కాక ప్రధాని విదేశీ వ్యవహారాలు,దౌత్యం చూసి భారతదేశం మా ఆప్తమిత్రుడని గర్వంగా చెబుతున్నాయి. బీజేపీ ప్రస్తుత పరిస్థితులు దేశంతో పాటు ప్రపంచంలో జనం మెచ్చిన పెద్ద శక్తని. దేశ ప్రధాని నరేంద్ర మోదీ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీజేపీ మండల అధ్యక్షుడు బిక్కు రాథోడ్‌ను ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ఆయన ఆరోగ్య విషయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిక్కుపైదాడిని సహించేది లేదన్నారు. వారం రోజుల క్రితం మా పార్టీ అధ్యక్షులపై జరిగిన దాడి కక్ష పూరితమన్నారు. పార్టీ పరంగా ఇతరులకు రాబోయే రోజుల్లో బిక్కు వలన పెద్ద నష్టం జరగుతుందన్నారు. స్థానిక రాజకీయ, ప్రజాప్రతినిధులు ఆయనపై దాడి చేపించారనే అనుమానం వ్యక్తమవుతుందని పేర్కొన్నారు. పార్టీపై కార్యకర్తలపై కుట్ర చేస్తే ఇక ముందు సహించేది లేదు.అలాంటి వారికి బయ పడేది లేదు రాబోయే స్థానిక ఎన్నికలో పార్టీ జెండా ఎగిరేల కార్యకర్తలు కష్టపడి పని చేయాలి అని సూచించారు.వారి వెంట బీజేపీ జిల్లా నాయకులు ప్రకాష్ చలుర్కర్, దేవిదాస్, దన్ను, సావన్, రాజు బర్కుంటే, హనమన్‌లు శ్రీకాంత్, సంతోష్ పాల్గొన్నారు.

శివారు కాలనీలకు న్యాయం చేయండి



మున్సిపల్ డీఈకు వినతిపత్రం అందచేస్తున్న కాలనీవాసులు

భైంసా,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ కేంద్రమైన భైంసాలో పట్టణాభివృద్ధి పథకంలో శివారు కాలనీలను విస్మరించి తీరని అన్యాయం చేసారని జనసేన ఉమ్మడి జిల్లా ప్రతినిధి సుంకెట మహేష్, బీజేవైఎం ప్రతినిధి ముల్లావార్ అనిల్‌లు ఆరోపించారు. సంబంధిత విషయంలో గురువారం మున్సిపల్ డీఈ జాదవ్ సంతోష్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా జనసేన,బీజేవైఎం ప్రతినిధులిరువులు మాట్లాడుతూ భైంసా పట్టణ పరిధిలో రూ.15 కోట్లతో చేపట్టి నగరాభివృద్ధి పథకంలో శివారు కాలనీలను విస్మరించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. మున్సిపల్ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించి కొన్ని ప్రాంతాలకే పట్టణాభివృద్ధిని పరిమితం చేసారని దుయ్యబట్టారు. శివారు కాలనీలన్నీ సమస్యలతో సతమతవుతున్న పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.మున్సిపల్ అధికార యంత్రాంగం ఇకనైనా స్పందించి పట్టణాభివృద్ధిలో శివారు కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో శివారు కాలలనీవాసులంతా ఏకమై ఆందోళనలు చేపడుతామని, ఇందుకు మున్సిపల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని వెల్లడించారు.

మత్తడిగూడ పాఠశాల సందర్శన



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈవో ఆశన్న

ఉట్నూర్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): దాహం ఏస్తే ఇంటికే శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చిన వార్తకు అధికారులు స్పందిచారు. మండలంలోని మత్తడిగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యనుమండల విద్యాధికారి ఆశన్న ఎంపీడీవో రాంప్రసాద్ దృష్టికి తీసుకు వెళ్లడంతో గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలతో పాటు, బాలికల ఉన్నతపాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న విద్య సామర్థ్యాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు బండి విజయ్ కుమార్ హాలీమా, సవిత, కార్యదర్శి సత్యనారాయణలు పాల్గొన్నారు.

అధ్వానంగా గబిడి రోడ్డు



గ్యాస్ సిలిండర్‌ను మోసుకెళుతున్న దృశ్యం

భీంపూర్,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): మండలం కరంజి (టీ)నుంచి గుబిడి వెళ్లే 8కిలో మీటర్ల రోడ్డు వర్షాలకు మరింత అధ్వానంగాతయారయింది. మోటార్ సైకిళ్లు కూడా రాలేని పరిస్థితి ఉన్నది. వర్షాలప్పుడు ఈ రోడ్డుపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని గుబిడి వాసులు ఆవేదన వ్యక్తం వ్యక్తంచేస్తున్నారు. అధికారులు, నాయకులు స్పందించి రోడ్డు ప్రమాదాలు జరుగకుండా తగుచర్యలు తీసుకోవాలని గుబిడి వాసులు కోరుతున్నారు.

గొల్లమాడ రోడ్డు సమస్యకు పరిష్కారం



గొల్లమాడ వద్ద రోడ్డు పనులు చేయిస్తున్న సింధే దీక్షిత్

నర్సాపూర్(జి), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనం గొల్లమాడ గ్రామ ప్రజల రోడ్డు కష్టాలను వెలుగులోకి తెచ్చింది. పెద్ద గుంతల కారణంగా ఆర్టీసీ బస్సు నిలిచిపోయి, ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఇది. అధికార వర్గాలు స్పందించకపోవడంతో బీఆర్‌ఎస్ నాయకుడు సింధే దీక్షిత్ పటేల్ స్వయంగా ముందుకొచ్చారు.ఆయన సొంత నిధులతో ఒక జేసీబీ,130 ట్రాక్టర్ల మొరంతో గుంతలను తక్షణమే పూడ్చి రోడ్డును బాగు చేయించారు. దీక్షిత్ పటేల్ చొరవతో ప్రజల రాకపోకల కష్టాలు తీరడంతో పాటు పక్క చేను రైతులకు కూడా పనులు జరిగేలా చూసినందుకు గ్రామస్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలపై ఎప్పుడు పోరాడతానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ఆరోగ్య పరంగా జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ సాగర్ మడావి

నార్నూర్,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ప్రాంత వాసులు ఆరోగ్య పరంగా జాగ్రత్తలు తీసుకోవాలని నార్నూర్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు జితేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బాబే ఝరిలో ఆరోగ్య వైద్య క్యాంప్ నిర్వహించి రోగులకు వైద్య చికిత్సలు అందించారు. టీబీ, ఎక్స్‌రే, బీపీ, షుగర్, క్యాన్సర్, డయాలసిస్, ఇతర వ్యాధులపై వైద్యం అందించి వారికి సలహా సూచనలు ఇచ్చారు. మద్యం, గుట్కా, ఇతర హానికర పదార్థాలు చాలా ప్రమాదకరమని తెలిపారు. వీటి వలన చాలా నష్టం జరగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బాలా సుబ్రహ్మణ్యం, చవాన్ చరణ్ దాస్, సుదర్శన్, మాజీ సర్పంచ్ మడావి సాగర్, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ భూమి పరిశీలన



మామడలో గుట్టను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

మామడ,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అటవీ ప్రాంతంలోని గుట్టపై గల భూమిని గురువారం సర్వేఆఫ్ ఇండియా అధికారులు సందర్శించారు. ఈ భూమి కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో 1817 సంవత్సరం నుంచి ఉందని దీనిని కంట్రోల్ పాయింట్‌గా ఏర్పాటు చేశారని కేంద్ర సర్వేయర్ జ్ఞాన సుందర్‌రావు అన్నారు. ఈ భూమి కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిందని అధికారులకు తెలియచేశారు.మట్టి నమూనాలను సేకరించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ మెహరాజ్, సర్వే ఆఫ్ ఇండియా అధికారులు, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

గాయపరిచిన కేసులో నిందితుల అరెస్టు



మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేష్ మీనా

నిర్మల్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బండతో రాయితో కొట్టి గాయ పరిచిన కేసులో నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు ఏఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం సోన్ గ్రామానికి చెందిన గఫార్ తన మిత్రులతో కలిసి రాత్రి జిల్లా కేంద్రానికి వచ్చి వారు భోజనం కోసం మయూరి హోటల్ వెళ్తున్న క్రమంలో తిరుమల లాడ్జి ఎదురుగా గఫార్ అతని స్నేహితులు నిలబడి ఉండగా అదే సమయంలో పట్టణంలోని బాలాజీవాడకు చెందిన రాజులదేవి ప్రమోద్ మోటార్ సైకిల్‌పై బుధవార్ పేట్‌కు చెందిన రాజ్ కుమార్ అనే అతడిని ఎక్కించుకొని వారి పక్కనుండే స్పీడ్‌గా వెళ్లగా, వారు మెల్లగా వెళ్లమని చెప్పినందుకు కావాలని గఫార్‌ని అతని స్నేహితులను బూతులు తిట్టి, గఫార్‌ని బండరాయితో కొట్టి గాయ పరిచి పారిపోయారని తెలిపారు. వారిని బైక్‌తో సహాపట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ ఇద్దరిపైన గత నేరచరిత్ర ఉన్నందున వారిద్దరిపై రౌడీ షీట్ ఓపెన్ చేయడం జరుగుతుందని ఏఎస్పీ తెలిపారు.

దేశీదారు స్వాధీనం

తాంసి,అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బండల్నాగాపూర్ గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు దేశీదారురవాణా చేస్తూ పట్టుబడ్డారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు నిఘావేసి రవాణా చేస్తున్న వారిని పట్టుకున్నారు. పట్టుకున్న దేశీదారు స్వాధీనం విలువ సుమారు రూ.14 వేల వరకు ఉంటుందని తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులు వివరించారు. ఈ గ్రామానికి చెందిన పలువురు గత నెల రోజుల క్రితం కూడా దేశీదారుతో పట్టుబడ్డారు. ప్రస్తుతం గ్రామంలో దేశీదారు విక్రయాలు ముమ్మరంగా సాగుతున్నాయని, పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పంట కుప్పను ఢీకొని వ్యక్తి మృతి

నిర్మల్‌రూరల్,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):రాత్రి వేళల్లో వాహనచోదకులు రోడ్డుపై ఉన్న పంట కుప్పను ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు.వారు తెలిపిన వివరాల ప్రకారం... న్యూవెల్మల్ గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి తన వాహనంతో పని నిమిత్తం తన ఇంట్లో నుంచి నిర్మల్ వస్తుండగా అక్కాపూర్‌లో సోలార్‌ఫ్యాక్టరీ దగ్గర గ్రామానికి చెందిన తుమ్మనపల్లి పద్మయ్య అనే వ్యక్తి సోయాబీన్ పంటను కుప్పగా రోడ్డుపై వేసి దానిపై ఒక నల్లటి కవర్‌ను కప్పి ఎటువంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకుండా ఉంచడంతో ప్రవీణ్‌కుమార్ రాత్రి సమయంలో తన ద్విచక్రవాహనం ప్రమాదవశాత్తు ఎక్కించడంతో స్లిప్ అయి రోడ్డు మీద పడిపోవడంతో తలకు తీవ్రమైన గాయమై సంఘటన స్థలంలోనే మరణించాడని ఫిర్యాదురాగా కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

చింతలబోరి అడవుల్లో పులి సంచారం



పాదముద్రలు పరిశీలించిన అటవీ శాఖఅధికారులు

బోథ్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి):బోథ్ రేంజ్ పరిధిలోని చింతలబోరి అడవుల్లో గురువారం ఉదయం పులి సంచరించినట్లు అటవీశాఖ అధికారులు పాదముద్రలను బట్టి నిర్ధారణకు వచ్చారు. అయితే చింతలబోరి ప్రాజెక్టు సమీపంలో స్థానికులు పులికాలి ముద్రలను పరిశీలించిన అనంతరం ముందుకు వెళ్లి పరిశీలించగా కొంత దూరంలో పులి కనిపించిందని స్థానికులు తెలిపారు. అడవిలోకి వెళ్లి కాలి ముద్రలను అటవీశాఖ అధికారులు పరిశీలించగా అవి పులి కాలి ముద్రలేనని నిర్ధారించారు.

అడవుల్లోకి వెళ్లొద్దు..

బోథ్ రేంజ్ పరిధిలో పులి సంచరిస్తున్నదని అయితే అడవుల్లోకి ఎవరు వెళ్లవద్దని అటవీశాఖ అధి కారి ప్రణయ్ తెలిపారు. పశువుల కావరులు అడవుల్లోకి వెళ్లొద్దని సూచించారు.అంతేకాక స్థానికులు సైతం అడవులలోకి ఒంటరిగా వెళ్లవద్దన్నారు.పులికన్పిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



కలెక్టర్‌కి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రోడ్డు పనులు చేపట్టాలి

» కలెక్టర్‌కు ప్రజలు, నాయకుల వినతి

భీంపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కరంజి(టి) గ్రామానికి వెళ్లే రోడ్డు పనులు చేపట్టాలని మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, ప్రజలు గురువారం కలెక్టర్ రాజార్షిషాకు వినతిపత్రం అందజేశారు. ఈ రోడ్డుపై నడవలేనంత అధ్వానంగా ఉందని, అత్యవసర పరిస్థితిలో అంబులెన్స్ వెళ్లలేని విధంగా ఉందని వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో గుండవార్ ప్రకాష్‌యాదవ్, బక్కి కపిల్ యాదవ్, గుర్ల శేఖర్, మేకల ప్రవీణ్, పెంటవార్ నితిన్, తదితరులున్నారు.

కేసులు ఎత్తేయాలి: బీఆర్ఎస్

బోథ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతుల తరఫున ధర్నా చేసిన బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన కేసులను ఎత్తేయాలని బీఆర్ఎస్ నాయకులు గురువారం సోనాలలో బంద్ చేపట్టారు. దీంతో వ్యాపార వాణిజ్యవర్గాల వారు బంద్‌లో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు దుకాణాలను తెరిచి ఉంచాలని కోరడంతోపాటు బలవంతంగా బంద్ చేపట్టేలా బీఆర్ఎస్ నాయకులు బెదిరించారని పలువురు ఆరోపించారు. సోనాలలో బోథ్ పోలీసులు బందోబస్తు చేపట్టారు.



మూసి ఉన్న దుకాణ సముదాయం



"జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లపై కాంట్రాక్టర్లు పెత్తనం చెలాయిస్తున్నారు. అడిగినంత ఇస్తే సరే.. లేదంటే ఎంతకైనా తెగిస్తున్నారు. ఇళ్ల నిర్మాణం పేరిట కాంట్రాక్టర్లు అడ్డగోలు దందాలకు ఎగబడ్డారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి సర్కారు రూ.5లక్షల నిధులను విడతల వారీగా మంజూరు చేస్తోంది. కానీ కాంట్రాక్టర్లు మాత్రం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.7లక్షల నుంచి రూ.8లక్షల వరకు వసూలు చేస్తున్నారు. సమయానికి బిల్లులు రాకపోతే నిర్మాణ పనులు ఆపేస్తున్నారు.



నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు





లబ్ధిదారుడిని చెట్టుకు కట్టేసిన దృశ్యం (ఫైల్)

ఇందిరమ్మ ఇళ్లపై కాంట్రాక్టర్ల పెత్తనం

» సోనాల ఘటనతో ఉలిక్కిపడ్డ అధికార యంత్రాంగం
» కాంట్రాక్టర్లుగా కాంగ్రెస్ నేతలు
» బిల్లుకు అదనంగా ఇవ్వాలంటూ లబ్ధిదారులతో ఒప్పందాలు
» అడ్వాన్సు రుణాలపై అవగాహన కరువు
» ఇంటి నిర్మాణం పేరిటా అడ్డగోలుగా దండుకుంటు ఆపై వేధింపులు

ఆదిలాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ బిల్లులతో బిల్లులతో తమకేమీ సంబంధం లేదంటూ కాంట్రాక్టర్లు లబ్ధిదారులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఇటీవల సోనాల మండలం కౌట(కె) గ్రామంలో చోటుచేసుకున్న అమానవీయ ఘటనపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. డబ్బులు ఇవ్వాలంటూ ఇందిరమ్మ లబ్ధిదారుడిని చెట్టుకు కట్టేసి దాడికి దిగడం చర్చనీయాంశమైంది. ఈ ఘటనతో జిల్లా అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టింది. కాంట్రాక్టర్‌పై బోథ్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదుచేసి అధికారులు చర్యలు చేపట్టారు. ఇలాంటి ఘటనలు పలు మండలాల్లోను చోటు చేసుకుంటున్న బయటకు పొక్కనివ్వకుండా జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 15,896 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మం జూరు చేసింది. దీంతో 9,187 ఇళ్లకు ఇప్పటి వరకు మార్ కోడ్ చేశారు. ఇప్పటివరకు ఆరు ఇళ్ల మాత్రమే పూర్తయినట్లు అధికారుల లెక్కలు చెప్తున్నాయి. బిల్లుల మంజూరులో జాప్యంతోనే పనులు నత్తనడకన సాగుతున్నాయి.

ఒప్పందం రద్దు.. కాంట్రాక్టర్‌పై కేసు

బోథ్: సోనాల మండలం కౌట గ్రామంలో ఐదు ఇళ్ల నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసినట్లు సోనాల ఎంపీడీఓ రాజేశ్వర్ తెలిపారు. కాంట్రాక్టర్ వ్యవహరించిన తీరుపై కేసు నమోదు నమోదైనట్లు తెలిపారు.

జంకుతున్న అధికారులు

ఇందిరమ్మ ఇళ్ల కాంట్రాక్టర్లు అంతా అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలే కావడంతో అధికారులు అడిగేందుకు జంకుతున్నట్లు తెలుస్తోంది. అడ్డగోలుగా ఇంటి నిర్మాణ ధరలను నిర్ణయిస్తూ (మిగతా 6వ పేజీలో..)

కాంట్రాక్టర్‌పై చర్యలు: కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: సోనాలలోని కౌట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం సందర్భంగా లబ్ధిదారుడిపై దాష్టీకం కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ రాజార్షిషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బోథ్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గుత్తేదారు ప్రవర్తనను తీవ్రంగా పరిగణించి, అతన్ని ఇందిరమ్మ హౌసింగ్ పనుల నుంచి తొలగించి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టినట్లు తెలిపారు.



సమావేశంలో సూచనలు చేస్తున్న కలెక్టర్ రాజార్షిషా

విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

» ప్రతీ విద్యార్థికి హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయాలి
» అధికారులతో జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రిన్సిపాళ్లు, అధికారులను కలెక్టర్ రాజార్షిషా సూచించారు. జిల్లాలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకునాణ్యమైన విద్యమౌలిక సదుపాయాలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ఈ.ఎం.ఆర్.ఎస్ ప్రిన్సిపాళ్లు, అధికారులతో జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యఅందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలల్లో సెల్‌టవర్స్ ఏర్పాటుచేయడం ద్వారా డిజిటల్ క్లాసులు, ఆన్‌లైన్‌లో పాఠాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నేషనల్ యూనిటీ డే నిర్వహించి, నశాముక్త భారత్ ప్రతిజ్ఞను విద్యార్థులు, ఉపాధ్యా యులు, అధికారులు, సిబ్బంది అందరూ చేయాలని సూచించారు. ప్రతీ విద్యార్థికి హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయాలని, సుమారు 480 మంది విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే టీమ్‌ల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ అంబాజీ, డీఆర్డీఓ రవీందర్, జిల్లా వైద్యఆరోగ్య అధికారి నరేందర్ రాథోడ్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గణేష్ జాదవ్, భూగర్భ జలశాఖ అధికారి శ్రీవల్లి, తదితరులు పాల్గొన్నారు.



పశువును పరిశీలిస్తున్న జిల్లా పశు వైద్యాధికారి రామారావు

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

» పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి రాథోడ్ రామారావు

బజార్‌హత్నూర్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ రాథోడ్ రామారావు అన్నారు. మండలకేంద్రంలోని జైశ్రీరాం గోశాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాథోడ్ రామారావు మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వ్యాధి బారిన పడిన పశువుల ద్వారా ఆరోగ్యమైన పశువులకు ఈ వ్యాధి త్వరగా సోకే ప్రమాదం ఉంటుందని అన్నారు. మండలంలో కొనసాగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమ వివరాలను స్థానిక పశువైద్యాధికారిని అడిగితెలుసుకున్నారు. ఇప్పటి వరకు 23గ్రామాల్లో 8287 పశువులకు టీకాలు ఇవ్వడం పూర్తయిందని పశువైద్యాధికారి డాక్టర్ పర్వేజ్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో జైశ్రీరాం గోశాల నిర్వాహకులు కళ్లెం నందు, సిబ్బంది పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, గ్రామస్థులు

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

సిరికొండ, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం సిరికొండ మండలకేంద్రంలో పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్సై పూజ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం కొవ్వొత్తులతో అమరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై పూజ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు, శాంతి భద్రతల పరిరక్షణలో విధులు నిర్వర్తిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులను స్మరించుకోవడం మనందరి బాధ్యతని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

బస్సు నడపాలని ఆర్ఎం, డీఎంకు వినతి



ఆర్ఎంకి వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

భీంపూర్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నుంచి కరంజి (టి)వరకు పాతపద్ధతిలోనే బస్సులు నడపాలని కోరుతూ భీంపూర్ మండల ప్రజలు ఆర్టీసీ ఆర్ఎం, డీఎంలకు గురువారం వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం అర్లి(టీ) వరకే నడపటంతో ఇందురుపల్లి, అంతర్గావ్, గోమూత్రి, కరజ్ వాడి, కరంజి (టి), రాజుల వాడి, టెక్డి రాంపూర్, తదితర గ్రామాల వారికి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీంతో సమయానుకూలంగా బస్సులు నడుపుతామని ఈ సందర్భంగా ఆర్ఎం, డీఎంలు హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చినవారిలో గుండా వార్ ప్రకాష్, బక్కి కపిల్‌యాదవ్, మేకల ప్రవీణ్, గుర్ల శేఖర్, పెంటవార్ నితిన్, ప్రశాంత్, రావుల విజయ్ యాదవ్, తదితరులు ఉన్నారు.

మైసమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ

భీంపూర్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరంజి (టి)లో గురువారం ఆదిలాబాద్ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆత్మచైర్మన్ కామస్ అశోక్‌లతో కలిసి గురువారం మైసమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ చేశారు. మహిళలు మంగళ హారతులతో వెళ్లి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొడిమెల దేవరెడ్డి,పెంద్యపు కృష్ణహన్ను పటేల్, మతీన్ పటేల్, తన్వీర్ పటేల్, బండి మల్లేష్, ఏనుగు అశోక్‌రెడ్డి, లస్మన్న పాల్గొన్నారు.



మంగళ హారతుల వస్తున్న మహిళలు

నిర్వహణ లేదు.. భద్రత పట్టదు
» ప్రమాదకరంగా రైతు వేదిక భవనాలు
7

అకాల వర్షం.. అపార నష్టం
» దెబ్బతిన్న సోయాబీన్, పత్తి పంటలు
6



తాంసిలో ధర్నా నిర్వహిస్తున్న రైతులు

తాంసిలో రైతుల ధర్నా

» తేమ శాతం పరిగణలోకి తీసుకోవద్దని డిమాండ్

తాంసి, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): పత్తి తేమ శాతానికి పరిగణలో తీసుకోకుండా కొనుగోళ్లు చేపట్టాలని తాంసి మండల కేంద్రంలో రైతులు గురువారం ధర్నాకు దిగారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు తాంసి గ్రామంలో తిరుగుతూ జైకిసాన్, జైజవాన్ అంటూ నినాదాలు చేశారు. 3గంటలపాటు రోడ్డుపై బైఠాయించారు. రైతులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అసలు ఈ సంవత్సరం దిగుబడులు అంతంత మాత్రమేనని అయినా కొనుగోలు విషయంలో 8శాతం తేమను పరిగణించడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున తేమశాతం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని 20వరకు తేమ శాతాన్ని పరిగణించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రైతులు కాళ్ల అనిల్‌రెడ్డి, విలాస్, కమ్మరి ప్రకాష్, తెనుగు అశోక్, వామన్‌రెడ్డి, మోహన్, దాతాజీ మహేందర్ పాల్గొన్నారు.

పరవళ్లు తొక్కుతున్న కుంటాల జలపాతం

నేరడిగొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటాల జలపాతం పరవళ్లు తొక్కుతోంది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు గురువారం జలపాతం పొంగిపొర్లుతోంది. ప్రకృతి అందాల నడుమ పాలనురుగులా నీరు జాలువారుతుంటే పర్యాటకులు మంత్రముగ్ధులవుతున్నారు. జలపాతాన్ని చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. పర్యాటకులు ప్రమాదాల బారినపడకుండా జలపాతం వద్ద అటవీ శాఖ అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



జలపాతం నుంచి ఉధృతంగా వస్తున్న నీరు

లాండ్రీ షాపుల బిల్లులు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న రజకులు

బోథ్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): రజకులు నిర్వహించుకుంటున్న లాండ్రీ షాపుల విద్యుత్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని రజకులు కోరుతున్నారు. గురువారం లాండ్రీ షాపులను మూసి వేసి నిరసన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో లాండ్రీ షాపుల వారికి ఉచిత విద్యుత్ అందించారని అయితే ఈసారి బకాయిలు చెల్లించకపోవడంతో తమకు విద్యుత్ సరఫరా నిలిపి వేసేలా ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

నవంబరు 2న సాఫ్ట్‌బాల్ పోటీలు

నేరడిగొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నవంబరు 2న సీనియర్ మహిళలు, పురుషుల సాఫ్ట్‌బాల్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలను మండలంలో స్థానిక జడ్పీఎస్ఎస్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు జాదవ్ అనిల్, ప్రధాన కార్యదర్శి గుమ్మంటి గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 10గంటలకు ఆధార్ కార్డు నాలుగు ఫోటోలను తీసుకుని వచ్చి ఆర్గనైజర్ సెక్రటరీ ఎస్‌ఓకే అఖిల్ పీడీ, కోచ్ రాధేశ్యాం, ఎన్ఐఎస్ కోచ్ ఓరగంటి అఖిల, పీఈటీలకు రిపోర్టుచేయాలని పేర్కొన్నారు. వివరాల కోసం 9000565142కు సంప్రదించాలని కోరారు.

అంతర్‌రాష్ట్ర రహదారిపై వాహనాల తనిఖీ



రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

తాంసి, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): అంతర్ రాష్ట్ర రహదారిపై తాంసి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారునికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై జీవన్‌రెడ్డి మాట్లాడుతూ మహారాష్ట్ర నుంచి అనుమతి లేని సరుకులను రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనం నడిపే ప్రతీ వ్యక్తి వాహనానికి సంబంధించిన పత్రా లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. వాహనానికి నంబర్ లేకపోతే చర్య లు తప్పవని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు సంబంధిత వాహనానికి ఇన్సూరెన్స్ కూడా చేయించుకోవాలని ఆదేశించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, దొరికితే కేసులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఉత్తమ్, హెడ్ కానిస్టేబుల్ రమేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

» పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి
» ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నమొల్లకిరణ్

ఆదిలాబాద్‌టౌన్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో ఎస్ఎఫ్ఐ చేపట్టిన కళాశాలల బంద్ విజయవంతమైంది. పట్టణంలోని గర్ల్స్ జూనియర్ కాలేజ్, బాయ్స్ జూనియర్ కాలేజ్, పాలిటెక్నిక్ కాలేజ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేతలు తరగతులు బహిష్కరించి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని అన్నారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం స్కాలర్షిప్‌లను చెల్లించకుండా విద్యార్థులను ఉన్నత చదువుకు దూరంచేసే ప్రయత్నాలు చేస్తున్నాయని అన్నారు. నాలుగేళ్లలో 8వేల కోట్ల మేరకు స్కాలర్‌షిప్‌లు ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని, విద్యార్థిసంఘాల పోరాట ఫలితంగా దీపావళి వరకు రూ.1200 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చి సీఎం మాట తప్పారన్నారు. కళాశాలలు మూతపడే పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెట్టి గణేష్, డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సునీల్, నాయకులు అర్జున్, ఆశిష్, కిరణ్, మురహరి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మండలకేంద్రంలో గురువారం కళాశాలల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు మాట్లాడుతూ 8,500 స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ ఉన్నాయని, ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. గత ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వకుండా నాలుగేళ్ల కాలయాపన చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహాలో పోతోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పూసం గణేష్, కాత్లే పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: ఉట్నూర్ మండల కేంద్రంలోని కళాశాలలను విద్యార్థి సంఘాల నాయకులు బంద్ చేయించారు. తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం తనుష్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు మేస్రం మారుతి, మడావినగేష్, నాయకులు నానేష్, పెందోర్‌లక్ష్మణ్, మడావినాగోరావ్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



కళాశాలను బంద్ చేయిస్తున్న నాయకులు



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నాయకులు